క్లుప్తంగా

ప్రధాని ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న రమేష్

జనగామ: కేంద్ర ప్రభుత్వం పంట ఉత్పత్తులకు మద్దతు ధర పెంచడాన్ని స్వాగతిస్తూ బీజేపీ ఆధ్వర్యాన శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ మాట్లాడుతూ.. ప్రధాని రైతుల పక్షపాతి అని, ఏటా సీజన్ పంట ఉత్పత్తులకు మద్దతు ధర పెంచుతూ రైతులకు పూర్తి భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. శ్రీని వాస్, డాక్టర్ కల్నల్ భిక్షపతి, తోకల ఉమారాణి, బొమ్మగాని అనిల్‌గౌడ్, దేవరాయ ఎల్లయ్య, కత్తుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీమహంకాళి అమ్మవారి తిరుగువారం వేడుకలు

స్టేషన్‌ఘన్‌పూర్: సముద్రాల గ్రామంలో శ్రీమహంకాళి అమ్మవారు, పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలను ఇటీవల ఘనంగా నిర్వహించగా శుక్రవారం గ్రామస్తులు తిరుగువారం పండుగను నిర్వహించారు. మహంకాళి అమ్మవారి దేవాలయం, పోచమ్మతల్లి గుడి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కుందూరు నాగమణి, సోమిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, లలితాదేవి, నాయకులు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, ఒరుగంటి వెంకటేశ్వర్లు, గుండె విమలనర్సయ్య, తాటికొండ కుమారస్వామి, భూస్కుల కిరణ్, వీరగోని రాజు, నారాయణ, ఇమ్మడి హరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తేవాలి

దేవరుప్పుల: సకల సౌకర్యాలతో ఉచిత విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తేవాలని తహసీల్దార్ ఆడెపు ఆండాలు సూచించారు. శుక్రవారం మండల పరిషత్‌లో ఎంఈఓ జి.కళావతి అధ్యక్షతన బడిబాట విజయవంతం కోసం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంపీఓ సురేష్‌కుమార్, ఐకెపి ఏపీఎం వెంకట్‌రెడ్డి, హబ్ ఇంచార్జీ రజిత, ఎఓ దివ్య,మండల వైద్యాధికారి రవితేజ , సమాఖ్య ప్రతినిధులు మమత శారద పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటం

పాలకుర్తి: కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం సీఐటీయూ పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల సోమన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏనుగుతల వెంకన్న, పెద్దాపురం, కుమార్, ఎల్లయ్య, ఉప్పన్న, పెండ్లి భాస్కర్, తోట రాజు తదితరులు పాల్గొన్నారు.

‘రెచ్చి పోతున్న మైనింగ్ మాఫియా’



ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న గణేష్‌సింగ్

రఘునాథపల్లి: మండలంలో మైనింగ్ మాఫియా రెచ్చిపోతోంది. కెనాల్ ఇరువైపులా మట్టి అక్రమంగా తరలిపోతుంది. అక్రమార్కులకు అధికారులు సహకరిస్తున్నారని, తగు చర్యలు తీసుకోవాలని రఘునాథపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఠాకూర్ గణేష్‌సింగ్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఏఓ మన్సూరికి వినతి పత్రం ఇవ్వగా సానుకూలంగా స్పందించారని ఠాకూర్ గణేష్‌సింగ్ తెలిపారు.

ఎన్‌హెచ్‌పై అంధకారం



పెంబర్తి ప్రధాన రహదారిపై వెలగని సెంట్రల్ లైటింగ్

జనగామ: వరంగల్–హైదరాబాద్ నేషనల్ హైవే జనగామ మండలం పెంబర్తి ప్రధాన రహదారిపై అంధకారం అలుముకుంది. సెంట్రల్ లైటింగ్ వెలగక పోవడంతో రోడ్డుదాటే క్రమంలో ద్విచక్ర వాహనచోదకులు, బాటసారులు ప్రమాదాలకు గురవుతున్నారు. హోటళ్లు, వైన్స్‌లతో పాటు సమీప గ్రామాలకు ఈ జంక్షన్ దాటి వెళ్లాల్సి ఉంటుంది. ఉంటుంది. రోడ్డుపై ఎదురెదురుగా వేగంతో దూసుకు వచ్చే వాహనాలు డ్రైవర్లకు కనబడని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై పలువురు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దుక్కిలో విత్తనాలు నాటడం కోసం అచ్చు తోలుతున్న రైతు



ట్రాక్టర్లతో దుక్కులు చదును చేస్తున్న రైతులు



పలకరించిన తొలకరి..

- ఖరీఫ్ సాగుకు రైతన్నలు సమాయత్తం

నర్మెట: తొలకరి జల్లులకు పుడమి పులకరించగా రైతన్నలు ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో రుతుపవనాలు పలకరిస్తాయనుకుంటున్న సమయంలో ముందస్తుగా కురిసిన జల్లులు పుడమిని తాకడంతో రైతన్నలు విత్తనాలు కొనుగోలు చేయడం, జీవాలతో సాగు భూముల్లో మందలు పెట్టం, దుక్కులను దున్నడం, అచ్చులు తోలడం, పత్తి విత్తనాలు విత్తడం, మిర్చీనారు, వరి నాటడంలాంటి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గత ఏడాదికంటే ముందుదగానే అనుకోని వర్షాలు పడటంతో రైతన్నలు సంబరపడి పోతున్నారు.



నర్మెటలో పత్తి విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు



నాటిన మిర్చినారు



పొలంలో గొర్రెల (జీవాల) మంద



పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళలు



దేవరుప్పుల: వరి నాట్లు వేస్తున్న మహిళలు

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

జిల్లా వైద్యాధికారి మల్లికార్జున్‌రావు



మాట్లాడుతున్న డాక్టర్ మల్లికార్జున్‌రావు

జనగామ: అంకితభావంతో పనిచేస్తూ గుర్తింపు వస్తుంది.. ఇందుకు మాస్ మీడియా అధికారి ప్రభాకర్‌గౌడ్ స్ఫూర్తి అని డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు అన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ప్రభాకర్‌గౌడ్ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రి, స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రభాకర్ ప్రత్యేక చొరవతీసుకుని ఎప్పుడూ అప్రమత్తంగా ఉండే వారని, అందరితో వైద్యారోగ్య శాఖకు కార్యకలాపాలకు సంబంధించి వందశాతం సక్సెస్ సాధించారని కొనియాడారు. అనంతరం ప్రభాకర్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ అధికారులు, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ లవకుమార్‌రెడ్డి, డాక్టర్ మహేందర్, డాక్టర్ బాలాజీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్, డాక్టర్లు రాజమౌళి, పగిడిపాటి సుగుణాకర్‌రాజు, అశోక్ కుమార్, భాస్కర్, రఘు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలి

దేవరుప్పుల: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ మల్లికార్జున్ రావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నిర్వహణ తీరుపై సమీక్ష జరిపి పలు సూచనలు చేశారు. పంచాయతీ పాలకవర్గ వ్యవస్థ లేనందున ఆయా గ్రామాల ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి జీపీ వ్యవస్థతో ముందస్తు చర్యలు తీసుకునేలా తోడ్పాటు అందించాలన్నారు. వర్షాకాలంలో దోమల నివారణ చర్యలు, ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాల శాతం పెంచేలా అవగాహన కల్పించాలన్నారు. మండల వైద్యాధికారి రవితేజ, వైద్యులు మనోజ్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టేందుకు సమగ్ర చట్టం తేవాలి

రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్



దేవరుప్పుల: విత్తనాల ప్యాకెట్లు చూస్తున్న రైతు సంఘం నాయకులు

దేవరుప్పుల: నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులను అరికట్టేందుకు పాలకవర్గాలు సమగ్ర చట్టం తేవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ శోభన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ దుకాణాన్ని రైతు సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన విత్తన కంపెనీలతో రైతులు మోస పోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమయ్య, భూక్యా చందు నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

జఫర్‌గఢ్: మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు రాకుండా అధికారులు అరికట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య కోరారు. కూనూర్ గ్రామంలో రైతు సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి శాగ శ్రీను అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. సోడం నాగరాజు, అబ్రబోయిన మైను, అనుమాల నాగేష్, చిక్కొండ భరత్, అనుమాల అమ్మాయి, శాగా యాదగిరి, తోట శివ తదితనేలే పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



రఘునాథపల్లి: బడిబాటలో హెచ్‌ఎం తదితరులు

రఘునాథపల్లి: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని ఖిలాషాపూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భారత రవీందర్ అన్నారు. శుక్రవారం ఖిలాషాపూర్‌లో చేపట్టిన బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేసి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం యాదవరెడ్డి, ఉపాధ్యాయులు పంచాక్షరి, ప్రసన్నరాణి, శ్రీకాంత్, నర్సింగరావు తదితరులు ఉన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అంకితభావం కలిగిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని శివునిపల్లి జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం కుసుమ రమేశ్ అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యూత్ కార్యదర్శి గోరంట్ల యాదగిరి ఆధ్వర్యంలో ముదిరాజ్‌కాలనీలో శుక్రవారం ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనాథ్, కొండ రవి, లక్ష్మీప్రసాద్, శ్రీనికాంత్, నాయకులు చెన్నూరి వెంకటేశ్వర్లు, కొండ వేణు, సురేష్, అనీల్, అజయ్, నాగరాజు, వేణు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

చిల్పూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2007–08 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని శుక్రవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అలనాడు పాఠాలు బోధించిన హెచ్‌ఎం శ్యాంసుందర్, ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి, అనీల్‌కుమార్, కృష్ణమూర్తి, శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు.

విజయవంతం చేయండి

జనగామ రూరల్: జూన్ 3వ తేదీన నర్మెటలో నిర్వహించనున్న సీపీఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవనంలో శుక్రవారం నిర్వహించిన ఏఐటీయూటీ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సీపీఐ అనేక పోరాటాలు చేస్తుందన్నారు. ఆది సాయన్న, యాకుబ్, ఆంజనేయులు, సుశీల, యాదగిరి, మల్లేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

- ఏసీపీ భీమ్‌శర్మ



స్టేషన్‌ఘన్‌పూర్: ఫర్టిలైజర్ షాపు యజమానితో మాట్లాడుతున్న ఏసీపీ భీమ్‌శర్మ

స్టేషన్‌ఘన్‌పూర్/లింగాలఘణపురం: రైతులకు ఫర్టిలైజర్ షాపుల యజమానులు నాణ్యమైన విత్తనాలనే అందించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్ శర్మ అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, లింగాలఘణపురం మండలంలోని పటేల్‌గూడెం గ్రామాల్లోని ఫర్టిలైజర్స్ షాపులు, ఎరువుల దుకాణాలను ఏసీపీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపులలోని స్టాక్‌లను, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. విత్తనాలను రైతులకు ఎమ్మార్పీ ధరలకే అందించాలన్నారు. ఆయన వెంట సీఐలు జి.వేణు, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు వినయ్‌కుమార్, వెంకటేశ్వర్లు ఏఓ వెంకటేశ్వర్లు, చంద్రన్‌కుమార్, ఈఐ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

కొడకండ్ల: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని మండల టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం హెచ్చరించింది. శుక్రవారం మండలకేంద్రంలోని విత్తన, ఎరువుల విక్రయ దుకాణాలను తహసీల్దార్ కోల చంద్రమోహన్, వ్యవసాయాధికారి విజయ్‌రెడ్డి, ఎస్సై చింత రాజులు తనిఖీ చేసి రసీదు పుస్తకాలు, లైసెన్సులు, స్టాక్ బోర్డులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఎస్సై కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: నాసిరకం విత్తనాలు, పురుగుల మందులు అమ్మి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని రఘునాథపల్లి ఎస్సై నరేష్, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, డీటీ శంకర్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు ఫెర్టిలైజర్ షాపులను సంయుక్తంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్‌బుక్స్, ఇన్వాయిస్‌లు పరిశీలించారు. నాణ్యత కలిగిన విత్తనాలు అమ్మాలని కొనుగోలు దారులకు తప్పనిసరి రసీదులు ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరక విక్రయించ కూడదని వారు వ్యాపారులకు సూచించారు. వారి వెంట ఆర్‌ఐ శరత్‌చంద్ర ఉన్నారు.

ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకన్న

- ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత వానాకాలం దృష్ట్యా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రేషన్‌కార్డుదారులకు జూన్ నెలలో ఒకేసారి జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్‌బియ్యాన్ని అందించనున్నట్లు ఆర్డీఓ డీఎస్ వెంకన్న తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ నెలలో ఒకేసారి లబ్ధిదారులకు మూడు నెలల రేషన్ బియ్యం అందించనున్న నేపథ్యంలో డీలర్లు ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలన్నారు. డీలర్లు ముందుగా స్టాక్ తమ రేషన్‌షాపులకు తెచ్చుకోవాలని, రేషన్ బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగినా డీలర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రజలకు సమాచారం అందేలా డీలర్లు టాంటాం వేయించాలని, సంబంధిత బ్యానర్లు, పోస్టర్లు వేయాలని సూచించారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జూన్ 1 నుంచి 30వ తేదీవరకు రేషన్‌షాపులలో బియ్యం పంపిణీ చేస్తారని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



తరిగొప్పల : చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామారావు

తరిగొప్పుల: చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మండాడపు రామారావు సూచించారు. మండలకేంద్రంలో గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం జరిగిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు సమస్యలపై స్పందించాలన్నారు. ప్రతీ పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంఈఓ నెల్లుట్ల జానకి, ఎఎస్సై కాసర్ల రాజయ్య,ఎంపీఓ మాలతి, ఆర్‌ఐ ఆంధ్రయ్య, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవు

నర్మెట: రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులను భంగం కలుగజేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ కలకుంట్ల వెంకట రామానుజా చార్యులు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేర మండల కేంద్రంలోని దళితవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలనీలో మౌలిక వసతుల కల్పన, అంటరానితనం నిర్మూలన, పారిశుద్ధ్య నిర్వాహణ, హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ కురికాల వేణు, ఎమ్మార్ఐ సింగారపు సాయిబాబు, ఎంఈఓ మడిపల్లి ఐలయ్య, ఏపీఓ బిరుకూరి రమాదేవి, మండల వైద్యాధికారి ఉదయ్ కిరణ్, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాస్, కార్యదర్శి కందకట్ల శ్రీధర్, ట్రైనీ ఎస్సై బండారి శివ, ఏఎస్సై వెంకట్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీలు కాలనీ వాసులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

దేవరుప్పుల: ప్రజాపాలన పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను సత్వరమే నెరవేర్చాలని ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు రాపాక శ్రీశైలం డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జూన్ 2వ తేదీన జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల జీఓ విడుదల చేయాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఆడెపు ఆండాలుకు అందజేశారు. బాకారం లావణ్య, మేడ సురేష్, కత్తుల సుధాకర్ పాల్గొన్నారు.

ముత్యం చెరువు దురాక్రమణను నిలువరించండి



నాయబ్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న అప్పిరెడ్డిపల్లె రైతులు

దేవరుప్పుల: మండలంలోని అప్పిరెడ్డిపల్లె ముత్యం చెరువు దురాక్రమణను సత్వరమే నిలువరించాలని అప్పిరెడ్డిపల్లె రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో నాయబ్ తహసీల్దార్ లచ్చునాయక్‌కు పల్లె రైతులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు పులిగిళ్ల మల్లయ్య, సుధాకర్, గ్రామస్థులు మాట్లాడుతూ గత రెండు పర్యాయాలు సదరు చెరువులోకి లింగాలఘనపురం మండలం వడిచర్లకు చెందిన ఓ వ్యక్తి అక్కడి గ్రామాల పేరిట పట్టాదారు పుస్తకం సంపాదించి ముత్యం చెరువు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారన్నారు. ఇరు మండలాల సర్వే అధికారులు వేసిన సరిహద్దులు తొలగిస్తూ బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అప్పిరెడ్డిపల్లె రైతులు, ముదిరాజ్‌లకు ప్రయోజనం కలిగే చెరువు దురాక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని పునరుద్ఘాటించారు. సత్యానారాయణ, మధుబాబు,సోమయ్య, యాదయ్య, నర్సయ్య, కొండయ్య, నర్సోజీ పాల్గొన్నారు.

రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు

- తప్పుడు ఆరోపణలు మానుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శివకుమార్

లింగాలఘణపురం: మండలంలోని కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వచ్చిన ఏడాదిన్నరలో రూ.15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు పార్టీ మండల అధ్యక్షుడు, జనగామ మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్యనాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేసిన అభివృద్ధిని చూడలేని కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, సీసీ రోడ్లు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జీడికల్–కళ్లెం రోడ్డు తదితర పనులకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శించడం తగదని అన్నారు. మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ కొంత మంది నాయకులు మండలంలో తనపై ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అందులో భాగంగా ఎక్కడో జరిగిన ఫాల్కాన్ సంస్థ ఆర్థిక నేరాలతో తన భార్య నల్లారి కావ్య పేరుతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇందులో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఎమ్మెల్యే శ్రీహరిపై, అనుచరులపై, చివరికి పీఏపై చేసిన అవినీతి ఆరోపణలు నిరూపించలేని కొంతమంది నాయకులు ఎమ్మెల్యేకు దగ్గరగా ఉండే తనపై ఆరోపణలు చేయలేక తన సతీమణి పేరుతో ఎక్కడో ఆంధ్రాలో ఉన్న ఆమె పేరును వినియోగించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అందుకు సంబంధించిన ఎఫ్‌ఆర్‌ఐ కాపీని పత్రికా విలేకరులకు విడుదల చేశారు. కాంగ్రెస్ యూత్ రాష్ట్ర నాయకుడు దిలీప్‌రెడ్డి, బీసీసెల్ మండల అధ్యక్షుడు ప్రవీణ్, పీఏసీఎస్ చైర్మన్లు ఉపేందర్, శ్రీశైలం, దేవస్థాన చైర్మన్ మూర్తి, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, మాజీ ఎంపీటీసీలు బిక్షపతి, నర్సయ్య, నాయకులు రాజు, నాగేందర్, అంజనేయులు, కృష్ణారెడ్డి, సంపత్, మోహన్, రమేష్, శేఖర్, నాగరాజు, బాలరాజు పాల్గొన్నారు.

3న సిద్దేశ్వరాలయంలో వేలం

బచ్చన్నపేట: కొడవటూర్ గ్రామంలో స్వయంభూ సిద్దేశ్వరాలయంలో వివిధ హక్కులను పొందేందుకు జూన్ 3వ తేదీన వేలం నిర్వహిచనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చిందం వంశీ తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో ఆయన మాట్లాడారు. టెంకాయలు, పూజా సామగ్రి విక్రయానికి రూ. 2 లక్షలు, స్వామి వారి లడ్డూ, పులిహోరకు రూ. 50 వేలు, తలనీలాలు పోగుచేసుకొనేందుకు రూ. 1.50 లక్షలు, కొబ్బరి ముక్కలు పోగుచేసుకొనేందుకు రూ. 25 వేలను బ్యాంకులో డీడీ తీసి ఆలయ అధికారులకు అందించిన వారు మాత్రమే వేలంలో పాల్గొనేందుకు అర్హులు అని అన్నారు. ఆసక్తిగల పాటదారులు డీడీలతో వేలంలో పాల్గొనాలని సూచించారు.

చర్య తీసుకోవాలి


పాలకుర్తి టౌన్: మేడిపల్లిలో ఫొటో గ్రాఫర్‌పై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో మండల ఫొటో గ్రాఫర్స్ యూనియన్ సభ్యులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి గజ్జి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు పట్టూరి శ్రీను, కోశాధికారి బాబు, బొమ్మగాని ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మంద కృష్ణ పోరాట ఫలితమే వర్గీకరణ

జఫర్‌గఢ్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమయిందని ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షులు రడపాక ఆదాం మాదిగ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు ఇల్లందుల రాంబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

గొర్రెల్లో చిటుకు వ్యాధి నివారణకు చర్యలు



చిల్పూరు: గొర్రెల్లో చిటుకు వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి మూడికె అనేష్ అన్నారు. శుక్రవారం ఆయన పశువులకు చిటుకు వ్యాధినివారణ టీకాలు వేసి యజమానులకు అవగాహన కల్పించారు.

కార్లు ఢీ.. పలువురికి గాయాలు

బచ్చన్నపేట: ఎదురెదురుగా వస్తున్న కార్లు ఢీన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఆలింపూర్ గ్రామం మసీద్ దగ్గర శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరి గుట్ట నుంచి కొమురవెళ్లి దేవస్థానానికి వెళ్తున్న ఎటిగా కారు.. కొమురవెళ్లి దేవస్థానం నుంచి సూర్యాపేటకు వెళ్తున్న డిజైర్ వాహనం ఆలింపూర్ మలుపు వద్ద ప్రమాదవశాత్తు ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఇరువురు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూ ట్యూబర్ ప్రవీణ్‌పై చర్యలు తీసుకోవాలి

జనగామ రూరల్: మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ చిలుక ప్రవీణ్‌పై చట్టపరంగా కఠిన చర్య తీసుకోవాలని ముస్లిం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది జమాల్ షరీఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మతపెద్దలతో కలిసి ఎస్‌హెచ్‌ఓ దామోదర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

చిల్పూరు: వెంకటాద్రిపేట గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించే ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి శుక్రవారం అర్చకులు చొల్లేటి రాజేశ్వరశర్మ వేద మంత్రాల నడుమ భూమిపూజ నిర్వహించారు. గౌడ సంఘం అధ్యక్షుడు టీవీ రాజుగౌడ్, రఘుపతి, యాదగిరి, కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.